టెండర్లు వేయకుండా కబేలా లీజ్ పొడిగించడమేంటి?

సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్

ముషీరాబాద్: అంబర్‌పేట్ (గోల్నాక) కబేలాను నిర్వహించే కాంట్రాక్ట్ పీరియడ్ ఏప్రిల్ 2024లో ముగిసినా టెండర్లు వేయకుండా లీజును పొడగించడం అక్రమమని సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. ఏప్రిల్ నుంచి ఆరు నెలల పాటు పొడగించిన జీహెచ్ఎంసీ అధికారులు మరోసారి పొగడించడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. టెండర్లు వేయకుండా లీజ్ పొడిగించాల్సిన అవసరం ఏమొచ్చింది..? 2021 ఏప్రిల్‌లో అన్మోల్ ట్రేడింగ్ కంపెనీ అల్ అహాద్ కంపెనీలతో కూడిన కన్సార్టియంతో మూడేళ్ల కాలానికి ఒప్పందం కుదుర్చుకున్న జీహెచ్ఎంసీ 2024 ఏప్రిల్ కంటే ముందే టెండర్ ప్రక్రియ మొదలు పెట్టకుండా సమయం లేదంటూ లీజ్ పొడిగిస్తూ వెళ్తున్నారని అన్నారు. లీజ్ పొడిగింపులో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని విమర్శించారు. కొన్నేళ్లుగా చెంగిచెర్ల కబేలాలో గత ప్రభుత్వం ఇదే రకమైన అక్రమాలకు పాల్పడిందని తెలిపారు. ఈ ప్రభుత్వం కూడా అంబర్‌పేట్‌లో అదే పద్ధతి కొనసాగిస్తుందని అన్నారు. లీజ్ పొడిగింపు తక్షణమే ఆపాలని, టెండర్ ప్రక్రియను వెంటనే మొదలు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సర్వేలో తప్పనిసరిగా రజక ధోబీ, చాకలి అని రాయించాలి

తెలంగాణ రజక ధోబీ అభివృద్ధి సంస్థ గ్రేటర్ ఛైర్మన్ నర్సింహ రజక



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎం.నర్సింహ రజక

కవాడిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు వచ్చే అధికారులకు రజకులు తమ పూర్తి వివరాలు తెలియజేయాలని తెలంగాణ రజక (ధోబీ) అభివృద్ధి సంస్థ గ్రేటర్ హైదరాబాద్ ఛైర్మన్ ఎం నర్సింహ కోరారు. అందరిలాగా మనం కూడా కులం పేరు చెప్పుకోవాలని సూచించారు. శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని సంస్థ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

◆ రాజ్యాధికారం సాధించాలంటే రజకుల సంఖ్య బలం ఎంత ఉందో రాష్ట్ర ప్రభుత్వానికి తెలియాలన్నారు. ప్రభుత్వం చేపట్టే సర్వేలో కులం ప్రస్తావన వచ్చినప్పుడు రజకులందరూ రజక ధోబీ, చాకలి అని రాయించాలని సూచించారు. కులంపేరు చెప్పుకోవడం తప్పేం కాదన్నారు. ప్రభుత్వం చేపట్టే కులగణనలో రజకులందరూ పాల్గొనాలని సూచించారు. రాజ్యంగ ఫలాలను పొందాలన్నా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం కులాల వారిగా కేటాయించే బడ్జెట్ లే ముఖ్యమని అన్నారు.

◆ ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ఛైర్మన్ మందలపు గాంధీ, ప్రధాన కార్యదర్శి జూపెల్లి రాజశేఖర్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి బి. చంద్రమోహన్, గ్రేటర్ వైస్ ఛైర్మన్ చీమల అశోక్, నాయకులు పి. కిషన్, పి. శ్రీధర్, ఏ. సుధాకర్, ఏ. రమేష్, కె. రమేష్, ఖాజానా దోబీఘాట్ అధ్యక్షులు ఆందోళ్ సాయి, సత్యానారాయణ, శ్రీను, కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కులాంతర వివాహిత జంటపై దాడి బాధాకరం

దుండగులను కఠినంగా శిక్షించాలి: కేవీపీఎస్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కులంతర వివాహం చేసుకున్న హరిప్రసాద్, రాజేశ్వరిలపై అమ్మాయి తల్లిదండ్రులు, బంధువులు దాడి చేయడం బాధాకరమని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు జాన్‌వెస్లీ, స్కైలాబ్‌బాబు ఓ ప్రకటనలో అన్నారు. వివాహం జరిగిన రోజే నల్గొండ డీఎస్పీని కలిసి రక్షణ కల్పించాలని దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఇరువురు తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ చేసి పంపించినప్పటికి మళ్లీ ఈ దౌర్జన్యం చేశారని చెప్పారు. గురువారం నల్గొండ హాస్పిటల్‌కు వైద్యం కోసం వచ్చిన వారిని రెండు కార్లలో వచ్చి అబ్బాయి కళ్లలో కారం చల్లి కర్రలతో దాడి చేశారన్నారు. ఆ తర్వాత రాజేశ్వరిని బలవంతంగా తీసుకెళ్లారని అన్నారు. అబ్బాయి దళితుడు కావడంతో ఈ అగ్రకుల దురహంకార చర్యకు ఒడిగట్టారని చెప్పారు. దాడి చేసిన వ్యక్తులపై హత్య నేరంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. ఆ జంటకు పోలీసులు పూర్తి స్థాయి రక్షణ కల్పించాలని కేవీపీఎస్ డిమాండ్ చేసింది. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

కులగణనను బీజేపీ వ్యతిరేకించడం దుర్మార్గం

బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్



కవాడిగూడ: 10శాతం అగ్రవర్ణ రిజర్వేషన్ల బండారం బయటపడుతుందనే కులగణన సర్వేపై బీజేపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం దోమలగూడలోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశంలో వంద సంవత్సరాల క్రితం బ్రిటీష్ అధికారులు తీసిన కులగణన లెక్కలే నేటికీ వంద సంవత్సరాలు గడుస్తున్నాయని అన్నారు. దానివల్ల నేటికీ బీసీలు విద్యా, ఉద్యోగ, ఆర్థిక రాజకీయ రంగాలలో తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు.

◆ కేంద్ర ప్రభుత్వం 10శాతం అగ్రవర్ణపేదలకు తెచ్చిన రిజర్వేషన్లు తెలంగాణలో వాళ్ల జనాభా కన్నా ఎక్కువగా ఉన్నాయని అవి ఈ సమగ్ర కులగణనతో తేటతెల్లం అవుతుందని స్పష్టం చేశారు. అగ్రవర్ణ పేదలకు ఏ ప్రాతిపదికన 10శాతం రిజర్వేషన్లు కల్పించారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అగ్రవర్ణ రిజర్వేషన్లతో బీసీలకు తీవ్ర నష్టం జరుగుతోంన్నారు.

◆ బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ వంటి వాళ్లు కులగణనపై విషం కక్కుతున్నారని మండిపడ్డారు. వీరికి చిత్తశుద్ధి ఉంటే వారి నియోజకవర్గాల్లో తమకు బీసీ ఓట్లు వద్దు అనగలిగే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు.

◆ ఇప్పటికైనా బీజేపీ నాయకులు సమగ్ర కులగణనను స్వాగతించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కులకచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, నాయకులు జాజుల లింగయ్య, మాదేశీ రాజేందర్, నర్సింహానాయక్, ఇంద్రం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం.. మూసీ అభివృద్ధి పేరుతో నాటకం

బీఆర్ఎస్ సీనియర్ నేత ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు



ముషీరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఎన్నికల హామీలను అమలు చేయలేక పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ సీనియర్ నేత ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు విమర్శించారు. హామీలు నెరవేర్చలేక తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే మూసీ నాలా అభివృద్ధి, హైడ్రా చట్టం పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి నాటకాలు ఆడుతున్నారని అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైడ్రాలో సీఎం రేవంత్‌రెడ్డి బంధువులు ఉండటంతో ఆ కట్టడాలను కూల్చలేక కేసుల పేరుతో కాలయాపన చేస్తున్నారని అన్నారు. కేవలం పేదలు, మధ్య తరగతి ప్రజల ఇళ్లను కూల్చివేస్తున్నారని విమర్శించారు.

◆ రాష్ట్ర మంత్రులు సంబంధం లేని శాఖల వివరాలను సైతం వెల్లడిస్తూ త్వరలో టపాకులు పేలుతాయి... బీఆర్ఎస్ అగ్రనాయకులు అరెస్టు అవుతారని ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే సీఎంతో పాటు మంత్రులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని అన్నారు. అధికారం శాశ్వతం కాదని, బీఆర్ఎస్ అగ్రనాయకులను వేధింపులకు గురి చేయడం మానుకుని ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయానల్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వివేక్, జంగ శ్రీనివాస్, మహేష్, గోరే తదితరులు పాల్గొన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగాలకు ప్రసిద్ధి.. శివబాగ్ క్షేత్రం

జియాగూడ సమర్థ నారాయణ ఆశ్రమంలో కొలువుదీరిన మహా శివుడు



- గోమాతలకు నిలయం
- నిరుపేదలకు నిత్యాన్నదానం
- కార్తీక మాసం కావడంతో భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయాలు



జియాగూడ: జియాగూడలోని సమర్థ నారాయణ ఆశ్రమంలో కార్తీక మాసంలో 12 జ్యోతిర్లింగాల దర్శనాల కోసం ప్రతిరోజూ భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలను దర్శించుకుంటున్నారు. 12 జ్యోతిర్లింగాలు ఆశ్రమం నలు దిక్కులా వ్యాపించి మహా పుణ్యక్షేత్రంగా శివబాగ్‌గా ఖ్యాతి గాంచింది. ఆలయాలలో ఏడాది పొడవునా ఉత్సవాలు నిర్వహిస్తారు.

12 జ్యోతిర్లింగాలు..

శివబాగ్‌గా పేరుగాంచిన ఆశ్రమంలో తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ, ఈశాన్యం నైరుతి, ఆగ్నేయం దిశలలో 12 జ్యోతిర్లింగాలను స్థాపించారు. ముఖ్యంగా అమరేశ్వరుడు, ఋతేశ్వరుడు, ముక్తేశ్వరుడు, కాశీవిశ్వనాథుడు, రామేశ్వరుడు, సోమనాథేశ్వరుడు, వైద్యనాథేశ్వరుడు, నాగేశ్వరుడు, ఓంకారేశ్వరుడు, హరిహరేశ్వరుడు, భీమేశ్వరుడు, కేదరేశ్వరుడు, స్పటిక లింగం, మహాశివుడు తదితర శివలింగాలు కొలువుదీరి ఉండడంతో సమర్థ నారాయణ ఆశ్రమం భక్తులతో విరాజిల్లుతుంది.

విశాలమైన కామధేను గోశాల..

భారత దేశంలో ఎక్కడ గోమాత ఆలయం లేదు. సమర్థ నారాయణ ఆశ్రమంలో గోమాత కొమ్ముల మధ్య నుంచి అమరేశ్వరుడిని దర్శించుకోవడం భక్తులు అదృష్టంగా భావిస్తారు. ఈ విశాలవంతమైన ఆశ్రమంలో సుమారు 6 వేలకు పైగా గోవులు సేదా తీరుతున్నాయని ఆశ్రమ 12వ పీఠాధిపతి ప్రభుదత్త మహారాజ్ తెలిపారు.



ఒకే పానపట్టంపై కొలువుదీరిన హరిహరేశ్వరులు





శివబాగ్ ఆలయాలలో జ్యోతిర్లింగాలు

వధూవరులకు ఆశీర్వాదం



ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, సరిత దంపతుల కూతురు అనురాధ, వరుడు గౌతం వివాహం ముషీరాబాద్‌లో శుక్రవారం ఘనంగా జరిగింది. వివాహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సుప్రియ, నాయకులు ముఠా జైసింహ, ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, వి.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుకు స్పందన

కాచిగూడ: బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తోందని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. శుక్రవారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో పార్టీ క్రియాశీల సభ్యత్వం తీసుకున్న వారికి సభ్యత్వ నమోదు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి యశ్వంత్, నాగభూషణం, వెంకటస్వామి గౌడ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూతనిస్తా



కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

అంబర్‌పేట: దివ్యాంగులకు తన వంతు చేయూతను ఇచ్చేందుకు సిద్ధంగా ఉంటానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గం దివ్యాంగుల సంఘం ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను ఆయన శుక్రవారం క్యాంపు కార్యాలయంలో అభినందించారు. వారికి శాలవా కప్పి సత్కరించారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధ్యక్షుడిగా ఎన్నికైన ఎం.భిక్షపతి, మహిళ అధ్యక్షురాలుగా ఎన్నికైన సరితలతో పాటు సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.

మహిళ అదృశ్యం



అక్కిరెడ్డి లక్ష్మి (ఫైల్)

నల్లకుంట: ఇంటి నుంచి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. అడ్మిన్ ఎస్సై జె. శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాలు.. ఏపీ సత్యసాయి జిల్లా ఎద్దులవండ్లపల్లి గ్రామానికి చెందిన అక్కిరెడ్డి లక్ష్మి(40) భర్త 2011లో మృతి చెందాడు. ఆ సమయంలో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో సురన్న(33) అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత 2017 నుంచి ఇద్దరూ కలిసి నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి సమీపంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని సహజీవనం చేస్తున్నారు. పింఛన్ విషయమై పని ఉండి ఆమె ఈనెల 1వ తేదీన తన స్వగ్రామానికి వెళ్లింది. తిరిగి 7వ తేదీన ఉదయం 5 గంటల సమయంలో హైదరాబాద్‌కు వచ్చిన ఆమెను సురన్న కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి తీసుకొవచ్చాడు. ఆ తర్వాత 6.30 గంటల సమయంలో అల్పాహారం తీసుకొస్తానని చెప్పిన సురన్న తిరిగి వచ్చే సరికి లక్ష్మి కనిపించలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సురన్న శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పిండ ప్రదానాలను అడ్డుకుంటే లీగల్ చర్యలే..

- బ్రాహ్మణ శ్రాద్ధ కర్మల విభాగాల సమావేశం నేడు
- జీబీడబ్ల్యూఏ వ్యవస్థాపక అధ్యక్షుడు గిరిప్రసాద్ శర్మ

కాచిగూడ: పిండ ప్రదానాలను అడ్డుకుంటే లీగల్ చర్యలు తీసుకుంటామని అన్నారు. వారాసిగూడలో ప్రసాద్ అనే పురోహితుడి ఇంటిపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. దాడులను ఇలాగే వదిలేస్తే మరింత రెచ్చిపోయి చాలా చోట్ల బ్రాహ్మణ శ్రాద్ధ కర్మలు నిర్వహించే సంస్థలపై దాడులు జరుగుతయని అన్నారు. పిండ ప్రదానాలు, శ్రాద్ధ కర్మలను క్షుద్ర పూజలుగా చిత్రీకరించి మన ఆదాయాలను గండి కొట్టేలా కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. శ్రాద్ధ కర్మలు నిర్వహించే బ్రాహ్మణుల్లో చైతన్యం కలిగించి వారికి గ్లోబల్ బ్రాహ్మిణ్ వెల్ఫేర్ అసోసియేషన్(జీబీడబ్ల్యూఏ) అండగా ఉంటుందన్నారు. ఈ నెల 9వ తేదీన శనివారం సాయంత్రం 5 గంటలకు బర్కత్‌పురలోని గ్లోబల్ బ్రాహ్మిణ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగే బ్రాహ్మణ శ్రాద్ధ కర్మల విభాగాల సంస్థల ప్రతినిధులు హాజరుకావాలని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఔషధ మొక్కల ప్రదర్శన



అవగాహన కల్పిస్తున్న అఖిల్

అబిడ్స్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యకర జీవితం పొందేందుకు పలు రకాల ఔషధ మొక్కలను ప్రగతి రిసార్ట్స్ ప్రదర్శన చేపట్టింది. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో కొనసాగుతున్న హెచ్ఎస్ఎస్ ఫేయిర్‌లో ఔషధ మొక్కలను అందుబాటులో ఉంచి వాటి ప్రయోజనాలను వివరిస్తున్నారు. యాంత్రిక జీవితంలో మనుషులను వేధిస్తున్న ప్రధాన ఆరోగ్య సమస్యలై బీపీ, షుగర్, థైరాయిడ్, కీళ్లనొప్పులు, ఇతర ఆరోగ్య సమస్యలను మొక్కల ఆకులను సేవించి ఎలా తగ్గించుకోవాలో వివరిస్తున్నారు. ఒక్కో మొక్క మనిషి ఆరోగ్యాన్ని సుభిక్షంగా ఉండేందుకే దోహదపడుతున్నాయని ప్రగతి రిసార్ట్స్ ప్రతినిధి అఖిల్ తెలిపారు. ప్రధానంగా సదాపాకు, మస్కిటో జెరినీయం, సంపంగి, ఇన్సులిన్, ర్యాబిట్, మింట్తు తులసి, రణపాల, లెమన్‌గ్రాస్, లవంగ తులసి, మల్లీ విటమిన్ ప్లాంట్, పారిజాత, పచౌలి, దేకింగ్, కిడ్నీటీలీఫ్, లాంగ్ పెప్పర్, డెటాల్ లీఫ్ లాంటి పలు రకాల ఔషధ మొక్కలను ఆరోగ్య సంరక్షణకు అందుబాటులో ఉంచారు. ఒక్కో ఔషధ మొక్క ఆకులను సేవించినా, ఔషధ మొక్క ఆకులను ఛాయ్‌లో లేదా వేడినీటిలో వేసుకొని సేవిస్తే కొద్ది రోజుల్లోనే ఆయా రోగాలు నాయమవుతాయని ఆయన వివరించారు. మనిషిలో ఏర్పాడే వివిధ రకాల రోగాలను తగ్గించే ఔషధ మొక్కలను ప్రదర్శనలో ఉంచి వాటి ఉపయోగాలు సందర్శకులకు క్లుప్తంగా వివరిస్తున్నారు.

వరల్డ్ పీస్ కౌన్సిల్ మహాసభకు డా.దిడ్డి సుధాకర్



కవాడిగూడ: నేపాల్ రాజధాని ఖాట్మాండ్‌లో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు ఐక్యరాజ్య సమితికి అనుబంధంగా ఉన్న వరల్డ్ పీస్ కౌన్సిల్ మహాసభలు జరుగనున్నాయి. అఖిల భారత శాంతి సంగీభావ సంఘం జాతీయ అధ్యక్ష వర్గ సభ్యులు డాక్టర్ దిడ్డి సుధాకర్ భారత దేశ ప్రతినిధిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా అఖిల భారత శాంతి సంగీభావ సంఘం ఆధ్వర్యంలో కవాడిగూడలో శుక్రవారం డాక్టర్ దిడ్డి సుధాకర్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.... దేశాల మధ్య యుద్ధాల నివారణ, ప్రపంచ శాంతి, బద్రత, స్వాతంత్ర్యం, ఆర్థిక, సామాజిక న్యాయం, అభివృద్ధి, పర్యావరణం, మానవ హక్కులు, సాంస్కృతిక వారసత్వం, పరిరక్షణ వంటి అంశాలపై ఈ మహాసభలలో చర్చించి పలు తీర్మానాలు చేస్తామన్నారు.

అవినీతిని అంతం చేయడంలో యువత పాత్ర కీలకం



పంజగుట్ట: అవినీతిని అంతం చేయడంలో యువత పాత్ర ఎంతో కీలకమని ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ అన్నారు. విజిలెన్స్ అవేర్నెస్ వీక్ కార్యక్రమంలో భాగంగా సమైఖ్య భారతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్ర సంఘటన్, కేంద్ర ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వ శాఖల సహకారంతో శుక్రవారం ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహనా సదస్సు నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజేంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్సై నాగరాజు, సమైఖ్య భారతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.నాగేశ్వరరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ అవినీతిని అంతమొందించడంలో ప్రతీఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. అవినీతి లేని సమాజం రూపొందించేందుకు విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సైదులు మాట్లాడుతూ మార్పు ఎక్కడ నుంచో రావాలని చూడకూడదని, మననుంచే మార్పు రావాలని అవినీతి ఎక్కడ జరిగినా ధైర్యంగా నిలదీయాలన్నారు. ప్రిన్సిపాల్ రాజేంద్రకుమార్ మాట్లాడుతూ సమాజంలో అవినీతి, లంచగొండితనం మితిమీరిపోయిందని, దాన్ని అరికట్టేందుకు విద్యార్థులు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీల్లో 40 మంది విద్యార్థులు పాల్గొనగా డి.రాహుల్ ప్రథమ బహుమతి, బి.రవీందర్ ద్వితీయ బహుమతి, ఈ.శివ తృతీయ బహుమతి సాధించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రవీందర్, ఎస్.విజయలక్ష్మి, అధ్యాపకులు వి.వి.సుబ్బారావు, జగన్నాధరావు, గిరిధర్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థుల ఫీజు పోరు

కాచిగూడ: బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'విద్యార్థుల ఫీజు పోరు'ను ఈనెల 9వ తేదీన నిర్వహిస్తున్నట్లు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ తెలిపారు. విద్యార్థుల ఫీజులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలనే డిమాండ్‌తో ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైఎంసీఏ వాలీబాల్ టోర్నమెంట్ వాయిదా

కాచిగూడ: వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్, నారాయణగూడ బ్రాంచి ఆధ్వర్యంలో నవంబర్ 8, 9 తేదీల్లో జరగాల్సిన 4వ వార్షిక వైఎంసీఏ డాక్టర్ నందన్ సింగ్ వాలీబాల్ ప్రైజ్‌మనీ టోర్నమెంట్-2024ను కొన్ని కారణాలతో వాయిదా వేసినట్లు వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ప్రధానకార్యదర్శి ఎం. ప్రీస్ట్‌లీ గైస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను తిరిగి ఈనెల 13, 14వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 77996 64455, 70326 60614.

సమగ్ర కులగణనను స్వాగతించండి

డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా. విశారదన్ మహారాజ్

కాచిగూడ: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణన సర్వేను ప్రజలంతా స్వాగతించి సహకరించాలని ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ పిలుపునిచ్చారు. బర్కత్‌పురలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కులగణన సర్వే భారత రాజ్యాంగ మూల సిద్ధాంతంపై ఆధారపడి ఉందన్నారు. కులగణన సర్వే రిపోర్టులను ప్రభుత్వం త్వరగా తెప్పించి రాష్ట్రంలో రాజకీయ వాటాని, ఆర్థిక సంపందలో భాగస్వామ్యాన్ని, సామాజిక న్యాయాన్ని 90శాతం అణగారిన కులాలందరికీ సమంగా పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పించాలి

కాచిగూడ: నగరంలోని నీలోఫర్, గాంధీ, ఉస్మానియా, కింగ్‌కోఠి ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు హస్మిబాబు, కార్యదర్శి ఎండీ జావీద్ అన్నారు. నారాయణగూడలోని డీవైఎఫ్ఐ నగర కార్యాలయంలో వారు మాట్లాడుతూ... నీలోఫర్ హాస్పిటల్‌లో నీళ్ల లేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. బోర్లు పనిచేయకపోవడంతో సర్జరీలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఆస్పత్రులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి పర్యటించి వసతులను మెరుగుపరిచే విధంగా చూడాలని కోరారు. రెండు రోజులుగా నీళ్ల అందక నరక యాతన పడినట్లు రోగుల సహాయకులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

శాలువాలు, బొకేలు వద్దు.. పిల్లలకు బుక్స్, స్టేషనరీ ఇవ్వండి

కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



కాచిగూడ: తనను కలువడానికి వచ్చే వారు శాలువాలు, పూల బొకేలు వద్దని వాటికి బదులు విద్యార్థులకు ఉపయోగపడే విధంగా బుక్స్, స్టేషనరీ ఇవ్వాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సూచించారు. సెంట్రల్ పీస్ కమిటీ ఈస్ట్‌జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శరత్‌శ్యామ్ శుక్రవారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని బర్కత్‌పురలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా శరత్‌శ్యామ్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారానికి, రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కిషన్‌రెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. కేంద్రమంత్రి సూచనల మేరకు పూల బొకేలు, శాలువాలు ఇవ్వకుండా పిల్లలకు ఉపయోగపడే విధంగా నోట్ బుక్స్, స్టేషనరీ అంజేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ కేంద్ర మంత్రి చేసిన సూచనలు పాటించినట్లయితే కొంత మంది విద్యార్థులైనా బాగుపడుతారని అన్నారు. సామాజిక సేవా దృక్పథంతో కిషన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని అన్నారు.

కవి సమ్మేళనంలో సత్తాచాటిన రెడ్డి కళాశాల విద్యార్థులు



కాచిగూడ: తెలంగాణ సాహితి దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కవి సమ్మేళనం నిర్వహించారు. బర్కత్‌పురలోని రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల విద్యార్థినులు పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా బహుమతులు గెల్చుకున్న విద్యార్థినులతో పాటు ఇంతగా వారిని ప్రోత్సహించిన కళాశాల తెలుగు విభాగం అధ్యాపకురాలు బి.ప్రవళికను చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వీసీ సూర్య ధనంజయ అభినందించారు.

ముఠా పద్మానరేష్‌కు కేటీఆర్ పరామర్శ



ముఠా పద్మానరేష్‌తో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

చిక్కడపల్లి: ఇటీవల వెన్నుముక శస్త్ర చికిత్స చేయించుకున్న మాజీ కార్పొరేటర్ ముఠా పద్మానరేష్‌ను మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం గాంధీనగర్‌లోని ఆమె నివాసంలో కలసి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని ప్రజాసేవలో పునరంకితం కావాలన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ గాంధీనగర్‌కు వస్తున్నారని తెలుసుకున్న బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అభిమానులు భారీగా తరలివచ్చి ఆయనను కలిసేందుకు ఉత్సాహాన్ని చూపారు. దీంతో కేటీఆర్ వారిని గమనించి వారందరితో సెల్ఫీలు దిగారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలో ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి (55) చనిపోయి ఉన్నాడు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.